KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

**నేటి మాట**

నీకు నచ్చినట్టు బ్రతకాలంటే ధైర్యం కావలి. ప్రపంచానికి నచ్చినట్టు బ్రతకాలంటే సర్దుకుపోవాలి



-స్వామి వివేకానంద

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 98 | గురువారం 26 మార్చి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

## అమెరికా శాంతి చర్చలపై ఇరాన్ షాకింగ్ ఆంక్షలు


- ఇరాన్ కఠిన షరతులు
- అమెరికాకు ఎదురుదాడి ఆంక్షలు
- హోర్ముజ్ జలసంధిపై కొత్త డిమాండ్
- పరిహారం, భద్రతపై పట్టుదల
- చర్చలపై గందరగోళం



2 లో

## వికారాబాద్ స్టీల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- మంటలతో భయాందోళన
- కార్మికులకు గాయాల సమాచారం
- లోపలికి ఎవరికి అనుమతి లేదు
- నిజాలను దాచే ప్రయత్నం?
- ఫైర్ సిబ్బంది కష్టపడి అదుపు



2 లో

## ఉగ్రకుట్ర కేసు.. హైదరాబాద్‌కు చెందిన మహిళా అరెస్ట్

- ముగ్గురు యువకులు అదుపులోకి
- హైదరాబాద్‌లో కుట్ర బయటపడింది
- మహిళా కీలక నిందితురాలు అరెస్ట్
- సోషల్ మీడియా ద్వారా కార్యకలాపాలు
- దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్




2 లో

## "అందుకే బంకుల్లో స్టాక్ ఖాళీ అవుతోంది"

### తెలంగాణ పెట్రోలియం డీలర్స్ బిగ్ వార్నింగ్

- పెట్రోల్ కొరతపై క్లారిటీ
- పానిక్ బైయింగ్‌తో స్టాక్ ఖాళీ
- డీలర్స్ అసోసియేషన్ హామీ
- డబ్బాల్లో నిల్వకు హెచ్చరిక
- నకిలీ వార్తలపై జాగ్రత్త



2 లో

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా



**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** జగిత్యాల కాంగ్రెస్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అభిమానులు, అనుచరుల సమక్షంలో ఆయన చేసిన ఈ ప్రకటన రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. బాధతప్త హృదయంతో పార్టీని వీడుతున్నానని ప్రకటించిన జీవన్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. "40 ఏళ్ల పాటు పార్టీ కోసం నిస్వార్థంగా పని చేశాను... కానీ నాకు సరైన గౌరవం దక్కలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యేల బలం ఉన్నప్పటికీ, వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడం పై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులు మంచివి కాదని మొదటి నుంచే చెబుతున్నానని గుర్తు చేశారు.

జగిత్యాల ఎమ్మెల్యేను కార్యకర్తలకు ఇష్టం లేకపోయినా పార్టీలో చేర్చుకున్నారని విమర్శించారు. తనతో ఉన్న కార్యకర్తలకు కూడా న్యాయం చేయలేకపోయాను అంటూ బాధను వ్యక్తం చేశారు. ఇక జాతీయ నాయకత్వం పై కూడా పరోక్ష వ్యాఖ్యలు చేసిన జీవన్ రెడ్డి... "రాహుల్ గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' అంటూ ముందుకు వెళ్తుంటే, ఇక్కడ మాత్రం ఆ విలువలను నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారు" అని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ పై కూడా విమర్శలు గుప్పించిన ఆయన..."ప్రభుత్వంతో కలిసి పని చేయడం వేరే విషయం... కానీ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం ఎందుకు?" అని ప్రశ్నించారు. తన అనుచరుడి హత్య జరిగినప్పుడు కూడా ముఖ్యమంత్రి పరామర్శించలేదని ఆరోపించిన జీవన్ రెడ్డి ఓపికకు కూడా హద్దు ఉంటుందని 20 నెలలుగా అవమానాలు భరిస్తూ వచ్చాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవం లేని చోట ఎలా పని చేయాలి?" అంటూ ప్రశ్నిస్తూ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీని వీడినప్పటికీ ఇందిరా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజాక్షేత్రంలో పనిచేస్తానని అన్నారు.

## అమరావతిపై ఏపీ అసెంబ్లీ చారిత్రక తీర్మానం

### ఈ నెల 28న ప్రత్యేక సమావేశం!




2 లో

**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** ఈ నెల 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ని ఖరారు చేస్తూ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక తీర్మానం చేయనుంది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు షాక్


# స్పీకర్‌కు కూడా నోటీసులు!



2 లో

**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం గా మారుతోంది. తాజాగా బుధవారం జరిగిన విచారణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరిన పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, స్పీకర్‌తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది.

# ఫైనాన్స్ బిల్లులో 53 సవరణలు..!



2 లో

**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** భారత ప్రభుత్వం పన్ను విధానంలో భారీ మార్పులు తేనుందా? అంటే అవుననే సమాచారం అందుతుంది.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026 ఫైనాన్స్ బిల్లులో మొత్తం 53 సవరణలు తీసుకువచ్చేందుకు సిద్ధం అయ్యారు.. ఆ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారని సమాచారం. వీటిలో 32 సవరణలు ప్రధానంగా పన్ను విధానాన్ని సులభతరం చేయడానికి, మిగతా 21 సవరణలు పరిపాలనా పరమైనవి అని అధికారులు చెబుతున్నారు..

ప్రధాన సవరణలు ఏమిటి?

ఈ సవరణల ప్రకారం, పన్ను శాఖకు కోర్టులు మరియు అప్పీల్ ట్రిబ్యునల్స్ ద్వారా ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా లెక్కింపు కేసులను మళ్లీ ప్రారంభించే అధికారం విస్తరించబడుతుంది. ఇప్పటికే ఉన్న సమయ పరిమితులను మించి కూడా అప్పీల్ అధికారుల తీర్మానాల ఆధారంగా పున:లెక్కింపులు చేయవచ్చు. దీని ద్వారా పాత పన్ను కేసులు కూడా న్యాయస్థానాల ఉత్తర్వుల ఆధారంగా తిరిగి పరిశీలించబడే అవకాశం ఏర్పడుతుంది. మరోవైపు.. పున:లెక్కింపుల సమయంలో ఎదురయ్యే లోపాలను సరిచేసి, స్పష్టమైన నిబంధనలను ప్రవేశపెట్టడం జరుగుతోంది. పన్ను నోటీసులు నిర్దిష్ట సమయ పరిమితితో వస్తాయి.. కనీసం 30 రోజులు, గరిష్టంగా 3 నెలల సమయం కేటాయించబడుతుంది.

## సెల్ఫ్ డిక్లరేషన్‌తో

# సాదాబైనామాల క్రమబద్ధీకరణ

- ✓ జీవో 76తో కొత్త మార్గదర్శకాలు
- ✓ అమ్మిన వారి అఫిడవిట్ అవసరం తొలగింపు
- ✓ 9 లక్షల దరఖాస్తులు ఇంకా పెండింగ్
- ✓ ఫీల్డ్ ఎంక్వయిరీకి గ్రీన్ సిగ్నల్
- ✓ రైతులకు భూమి హక్కుల సమస్యలు
- ✓ సంక్షేమ పథకాల నుంచి రైతులు దూరం
- ✓ సర్వే ప్రక్రియకు క్లియరెన్స్ కీలకం
- ✓ ఖమ్మం జిల్లాలో అధిక దరఖాస్తులు
- ✓ ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల హర్షం




**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలును కొందరు సీనియర్ అధికారులు ప్రశ్నార్థకం చేశారు. చట్టానికి భిన్నంగా రూల్స్‌ను రూపొందించడం వల్ల 3 నెలల్లో పూర్తి కావాల్సిన సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం ఆర్నెల్లయినా దొరకడం లేదు. 9 లక్షల దరఖాస్తుల్లో 9 వేలు కూడా ఆమోదానికి నోచుకోలేదు. అమ్మిన వ్యక్తి సమ్మతి అవసరం అంటూ ఏసీ గదుల్లో కూర్చొని నిబంధనలు రూపొందించిన ఐఏఎస్ అధికారులపై జనం మండిపడ్డారు. తాజాగా అమ్మిన వ్యక్తి ప్రమేయం లేకుండానే ఫీల్డ్ ఎంక్వయిరీతో చేయించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది.

కేవలం కొనుగోలు చేసిన వ్యక్తి అఫిడవిట్ సమర్పించడం ద్వారా రెగ్యులరైజ్ చేయడానికి జీవో 76ను జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం శాసనమండలిలో ప్రకటించారు. త్వరలోనే సవరణలతో కూడిన గైడ్ లైన్స్ రాబోతున్నట్లు సమాచారం. దీని ద్వారా త్వరితగతిన 9 లక్షల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అయితే, ఇన్నాళ్లు అమ్మిన వ్యక్తి తాను అమ్మేసినట్లు అఫిడవిట్ ఇవ్వడానికి ముందుకు రారని, రావడం లేదన్న క్షేత్ర స్థాయి వాస్తవాలను తహశీల్దార్లు, దరఖాస్తుదారులు చెబుతూ నే ఉన్నారు. అది నిజమేనని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిలు సైతం గుర్తించారు. కానీ, కొందరు ఐఏఎస్ అధికారులు మాత్రం అదేదో జరిగిపోతుందన్న అభూత కల్పనలను అల్లి కాలయాపన చేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**దరఖాస్తుల క్లియరెన్స్ అనివార్యం**


రాష్ట్రంలో 9 లక్షల అప్లికేషన్లు పెండింగులో ఉన్నాయంటే సుమారు 18 లక్షల ఎకరాలకు పైగానే విస్తీర్ణం ఉంటుంది. ప్రతి ఊరిలోనూ కనీసం 50కి పైగా రైతుల భూమి హక్కులు ప్రశ్నార్థకంగా మిగులుతోంది. వీళ్లకు భూమి ఉంటుంది.. కానీ, ప్రభుత్వం హక్కులు కల్పించడం లేదు. ఇప్పటికే వారు రైతు భరోసా, రైతు బీమా, బ్యాంకు రుణాలు, రుణ మాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఇప్పటికైనా నిజమైన భూమి హక్కుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయడం అనివార్యమని రెవెన్యూ నిపుణులు భూమి సునీల్ పలు సందర్భాల్లో అధికారులకు వివరించారు.

**సర్వే చేయాలంటే క్లియరెన్స్ ఉండాల్సిందే..**

ప్రతి ఊరిలోనూ కనీసం 30 నుంచి 40 సర్వే నంబర్లు సర్వే చేయకుండా పెండింగులో ఉంటాయి. దీందో పక్క సర్వే నంబర్లలోని విస్తీర్ణంపైనా ప్రభావం ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవాట్ కబ్జాలు అధికం.

మిగతాది 2 లో..

## అనుమతులు లేకుండా హర్మూజ్ జలసంధిని దాటే యత్నం పాక్ నౌకను వెనక్కి పంపిన ఇరాన్



2 లో

**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హర్మూజ్ జలసంధి ని దాటేందుకు యత్నించిన పాకిస్థాన్ నౌక ను ఇరాన్ వెనక్కి పంపించింది. హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాక్ కంటైనర్ షిప్‌ను ఇరాన్ వెనక్కి పంపింది.

## కవిత కొత్త పార్టీ ప్రకటన

### 'తెలంగాణ ప్రజా జాగృతి'కి ముహూర్తం ఖరారు!



2 లో

**న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్):** స్టేట్ పాలిటిక్స్‌లో మరో కొత్త పార్టీ పురుడు పోసుకోబోతోంది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తాన్ని ఖరారు చేశారు.

# భార్యపై కోపంతో సపోటాలో విషం రెండేళ్ల కూతుర్ని కడతేర్చిన తండ్రి

న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): భార్య మీద కోపంతో ఓ భర్త దారుణానికి ఒడిగట్టాడు. తన రెండేళ్ల కూతురికి సపోటా పండులో విషం పెట్టి హత్య చేశాడు. అనంతరం అతనూ ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ విషాదం చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లక్ష్మమ్మగూడెం గ్రామానికి చెందిన రవికి కొన్నాళ్ల క్రితం స్వాతికి వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు మేఘన (2), మయూరి (9నెలలు) ఉన్నారు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా మూడు నెలల క్రితం చిన్న కూతుర్ని తీసుకుని స్వాతి పుట్టింటికి వెళ్లింది. పెద్ద కూతురు మేఘన తండ్రితోనే ఉంటుంది. అయితే పెద్ద కూతుర్ని కూడా తమ వద్దకే పంపాలని స్వాతి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్ద మనుషుల సమక్షంలో దంపతులతో చర్చలు జరిపారు. పరువు పోయిందనే కోపం, కూతురు దూరమవుతుందన్న బాధతో తన పెద్ద కూతురికి సపోటా పండులో ఎలుకలమందు కలిపి ఇచ్చి, తాను కూడా ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

ఇది గమనించిన కుటుంసభ్యులు వారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. రవి పరిస్థితి విషమంగా ఉంది.

# అనుమతులు లేకుండా హర్మూజ్ జలసంధిని దాటే యత్నం..పాక్ నౌకను వెనక్కి పంపిన ఇరాన్



న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హర్మూజ్ జలసంధి ని దాటేందుకు యత్నించిన పాకిస్థాన్ నౌక ను ఇరాన్ వెనక్కి పంపించింది. హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాక్ కంటైనర్ షిప్‌ను ఇరాన్ వెనక్కి పంపింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ సరిహద్దుల్లోని హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం నిబంధనలు విధించింది. ఈ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తప్పనిసరి చేసింది.

ఈ క్రమంలో హర్మూజ్ మీదుగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ కరాచీకి వెళ్తోంది. అయితే అనుమతులు లేకుండా వెళ్తున్న ఆ నౌకను వెనక్కి రప్పించినట్లు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ వెల్లడించింది. హర్మూజ్ గుండా వెళ్లే ప్రతి నౌక ఐఆర్జీసీ సముద్ర అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని ఇరాన్ స్పష్టంగా చెప్పింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జోక్యం చేసుకుంటామని హెచ్చరించింది.

పాకిస్థాన్‌కు చెందిన నౌకను ఇరాన్ వెనక్కి రప్పించినట్లు కాబుల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధృవీకరించింది. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ లోని షార్జా నుంచి ఈ నౌక కరాచీకి వెళ్తుండగా ఇరాన్ అడ్డుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. ఈ జలసంధి గుండా తాము అనుమతించిన నౌకలు వెళ్లాలని చెబుతోంది.

# కవిత కొత్త పార్టీ ప్రకటన..

## 'తెలంగాణ ప్రజా జాగృతి'కి ముహూర్తం ఖరారు!

న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): స్టేట్ పాలిటిక్స్‌లో మరో కొత్త పార్టీ పురుడు పోసుకోబోతోంది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఈ నెల 27న అంటే శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆమె కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారు. కవిత తన పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' అనే పేరును ఖరారు చేశారు. ఇప్పటికే ఈ పేరుతో పార్టీ నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేయగా, దీనిపై ఢిల్లీ హైకోర్టులోనూ విచారణ జరిగింది. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తికానుందని సమాచారం.

మెట్టినింటి నుంచే పార్టీ విధివిధానాల ప్రకటన..

తన మెట్టినిల్లు సిద్దిపేట నుంచే పార్టీ జెండా, గుర్తు, పార్టీ విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉంది. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతం ప్రాతిపదికన, సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఈ పార్టీ పని చేయనుందని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు పార్టీలో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగ కవిత తాను పోటీ చేయబోయే నియోజకవర్గాన్ని కూడా శ్రీరామ నవమి రోజే ప్రకటించే చాన్స్ ఉంది.

# ఇప్ప పువ్వు సారాతో 100 ఏళ్ల ఆయుష్షు.. అసెంబ్లీలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఇప్ప చెట్టుకు 5 వేల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, దాని ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఇప్ప పువ్వు వినియోగం, దాని ద్వారా గిరిజనులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విక్రయిస్తున్న చీప్ లిక్కర్ వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతోందని, 60 ఏళ్లు కూడా బతకలేని పరిస్థితి నెలకొందని అనిరుధ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని తాండాల ప్రజలు గతంలో ఇప్ప పూల సారా తాగి 100 ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవించారని ఆయన గుర్తుచేశారు. ఇప్ప పువ్వును టీలో కలిపి తీసుకోవడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఉపాధి అవకాశాలు..

ఇప్ప పువ్వుతో కేవలం సారా మాత్రమే కాకుండా ఐస్‌క్రీమ్, కేక్స్, లడ్డూలు, బిస్కెట్లు వంటి రకరకాల ఆహార పదార్థాలను తయారు చేయవచ్చని ఎమ్మెల్యే సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 1.6 లక్షల మంది ఇప్ప పూల సేకరణ ద్వారా ఉపాధి పొందుతున్నారని, మధ్యప్రదేశ్‌లో 'మాండ్' అనే డ్రింక్‌ను బాటిల్ రూ. 800 చొప్పున విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారని వివరించారు. అక్కడ ప్రభుత్వమే శిక్షణతో పాటు యంత్రాలను కూడా అందిస్తోందని తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు డిమాండ్..

తెలంగాణలోని ఆదివాసీలు, ఎస్టీ సోదరులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్ప పువ్వు సారా తయారీకి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని, గిరిజనులకు మెరుగైన ఉపాధి లభిస్తుందని అన్నారు. బ్రిటిష్ కాలంలో విధించిన పాత నిబంధనలను పక్కన పెట్టి, ఆధునిక పద్ధతుల్లో ఇప్ప ఉత్పత్తులను ప్రోత్సహించాలని అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు షాక్.. స్పీకర్‌కు కూడా నోటీసులు!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఈ వ్యవహారంపై పూర్తి వివరణతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది.

అలాగే అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఫిరాయించిన వారిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. స్పీకర్ కార్యాలయం నుంచి వచ్చే స్పందన, ఎమ్మెల్యేలు ఇచ్చే కౌంటర్ అఫిడవిట్లపై ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉన్నట్లు తెలుస్తుంది. న్యాయస్థానం ఈ సంచలన కేసు తదుపరి విచారణను వచ్చే నెల 16 కు వాయిదా వేయడంతో, అప్పటి వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది. ఇదిలా ఉంటే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ఎమ్మెల్యే దానం నాగేందర్ కు, స్పీకర్ కు కోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ పిటిషన్ తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 16 కు వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# అమరావతిపై ఏపీ అసెంబ్లీ చారిత్రక తీర్మానం.. ఈ నెల 28న ప్రత్యేక సమావేశం!

మొదటి పేజీ తరువాయి

గత కొంతకాలంగా కొనసాగుతున్న రాజధాని సందిగ్ధతకు తెర దించుతూ, అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ ఈ తీర్మానాన్ని ఆమోదించనున్నారు. అనంతరం, ఈ అధికారిక తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు పంపించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

ఈ చారిత్రాత్మక ఘట్టానికి కూటమిలోని సభ్యులందరూ (టీడీపీ, జనసేన, బీజేపీ) తప్పనిసరిగా హాజరయ్యేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ నిర్ణయం ద్వారా అమరావతి నిర్మాణ పనులకు మరింత వేగం వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రత్యేక సమావేశం ద్వారా అమరావతి విషయంలో నెలకొన్న న్యాయపరమైన, రాజకీయపరమైన చిక్కులన్నింటికీ శాశ్వత పరిష్కారం లభించనుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అమెరికా శాంతి చర్చలపై...ఇరాన్ షాకింగ్ ఆంక్షలు

న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): అమెరికా, ఇజ్రాయెల్– ఇరాన్ యుద్ధం గత 25 రోజులుగా కొనసాగుతూనే ఉంది. దీంతో ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని ముగించేందుకు పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో 15 అంశాల శాంతి ప్రణాళికను ప్రతిపాదించారు. ఈ ప్రణాళికలో ఇరాన్ తన అణు కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయాలని, యురేనియం నిల్వలను అప్పగించాలని, అంతర్జాతీయ నౌకల రాకపోకల కోసం 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధిని తెరవాలని ప్రధానంగా కోరారు. అయితే, ఇరాన్ ఈ ప్రతిపాదనలపై సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికా తనపై విధించిన ఆర్థిక అంక్షలను పూర్తిగా ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామని స్పష్టం చేస్తూనే, ఎదురుదాడిలో భాగంగా అమెరికా ఉన్నతాధికారులు, రక్షణ సంస్థలపై సొంతంగా ఆంక్షలు విధిస్తూ షాక్ ఇచ్చింది.

శాంతి చర్చల నేపథ్యంలో ఇరాన్ ఒక వినూత్నమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే ప్రతి అమెరికా– ఇజ్రాయెల్ నౌకకు ప్రతిఫలంగా, ఇరాన్‌పై ఉన్న ఒక అంతర్జాతీయ అంక్షను తొలగించాలని షరతు పెట్టింది. దీనితో పాటు గత దాడుల వల్ల జరిగిన నష్టానికి భారీగా పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో దాడులు జరగవని అంతర్జాతీయ హామీ ఇవ్వాలని ఇరాన్ విదేశాంగ శాఖ పట్టుబడుతోంది. అటు ట్రంప్ ప్రభుత్వం చర్చలు జరుగుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నా, ఇరాన్ మాత్రం అధికారికంగా ఎటువంటి చర్చలు జరగలేదని కొట్టిపారేస్తూ పశ్చిమ దేశాల అధికారులపై అంక్షలు విధించడం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. అలాగే అరబ్ కంట్రీస్ లో ఉన్న యూఎస్ ఆర్మీ బేసులను కూడా తొలగించాలని ఇరాన్ తన అంక్షాల్లో తెలిపింది. దీనిపై అమెరికా ఏ విధంగా స్పందిస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# వికారాబాద్ స్టీల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు



న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): వికారాబాద్ జిల్లాలోని ఓ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం భారీ పేలుడు సంభవించింది. పరిగి మండలం లక్ష్మీదేవిపల్లిలో ఈ ఘటన జరిగింది. సుగుణ మెటల్స్ లిమిటెడ్ కంపెనీలో ఒక్కసారిగా స్టీల్ ప్లాంట్ బట్టీ పేలడంతో మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ వెలువడుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పేలుడు ఘటన సమయంలో కంపెనీలో ఉన్న పలువురు కార్మికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావలసి ఉంది. పేలుడు నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం ఎవ్వరినీ లోపలికి అనుమతించడం లేదు.

ప్రమాదం జరిగిన వెంటనే మీడియా, స్థానికులు అక్కడికి చేరుకోగా, సెక్యూరిటీ సిబ్బంది గేట్లు వేసి లోపలికి ఎవరినీ రానివ్వలేదు. ఘటన గురించి ప్రశ్నించగా, అది ప్లాంట్ పేలుడు కాదని, కేవలం లారీ టైర్ పేలిందని చెప్పి వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అదనపు ఫైర్ ఇంజన్లను కూడా రప్పించినట్లు తెలుస్తోంది. పరిస్థితి అదుపులోకి వచ్చాకే ఎవరైనా గాయపడ్డారా? ప్రమాదానికి గల కారణాలేంటి? అనే విషయాలు తెలిసే అవకాశం ఉందని ఫైరింజన్ అధికారులు పేర్కొన్నారు.

# పాత నాణేల పేరుతో భారీ మోసం... మహిళ ఖాతా ఖాళీ !

న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): పాత నాణేలకు భారీ మొత్తంలో డబ్బులు ఇస్తామని మాయమాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఘటన మండలంలో వెలుగులోకి వచ్చింది. వీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ మోసానికి బలైంది. గ్రామానికి చెందిన జిడ్డు లక్ష్మి అనే మహిళ మొబైల్ ఫోన్‌లో రీల్స్ చూస్తున్న సమయంలో రూ.10, రూ.20 విలువ గల పాత నాణేలు ఇరవై ఉంటే రూ.6 లక్షలు ఇస్తామని ఓ ప్రకటన కనిపించింది. ఈ ప్రకటనకు ఆకర్షితురాలైన ఆమె అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు సంప్రదించింది. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు ఆమెను నమ్మబలికి, పాత నాణేలకు లక్షలు పొందాలంటే ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు పంపాలని సూచించారు. బాధితురాలు వారి మాటలు నమ్మి అవసరమైన వివరాలు పంపించింది.

తర్వాత డబ్బులు పొందేందుకు ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో కొంత మొత్తాన్ని చెల్లించాలని నేరగాళ్లు చెప్పడంతో, ఆమె బ్యాంక్ ఖాతాకు సంబంధించిన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని కూడా వారికి తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఖాతా నుంచి రూ.8,500తో పాటు యూపీఐ ద్వారా రెండు సార్లు రూ.8,550 చొప్పున, మరోసారి రూ.9,550 మొత్తాలు డెబిట్ అయ్యాయి. మొత్తం డబ్బులు కోల్పోయిన తర్వాత కూడా నేరగాళ్లు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జాగ్రత్తలు అవసరం

ఇటీవల పాత నాణేలు, నోట్ల పేరుతో భారీ లాభాలు వస్తాయని చెప్పి సైబర్ మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఇవ్వకూడదని, ఇలాంటి ప్రకటనలను నమ్మవద్దని సూచిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపాన్ని ఉపయోగించుకుంటూ సైబర్ నేరగాళ్లు మరింతగా చెలరేగుతున్నట్లు స్పష్టమవుతోంది.

# సెల్ఫ్ డిక్లరేషన్‌తో సాదాబైనామాల క్రమబద్ధీకరణ

ఈ క్రమంలో ప్రతి సర్వే నంబరులోని విస్తీర్ణం, దానికి సంబంధించిన హక్కుదారుల లెక్క తేలితేనే సర్వే చేయడానికి కుదురుతుంది. ఇవన్నీ ఇలాగే పెండింగులో ఉంచడం ద్వారా సర్వే ప్రక్రియ మొదలు పెడితే తిరిగి సరిహద్దు వివాదాలు తలెత్తే అవకాశాలు అధికంగా ఉంటాయని రెవెన్యూ అంటున్నాయి.

ఖమ్మంలోనే అధికం

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత జిల్లాలోనే సాదాబైనామా దరఖాస్తులు అధికం. ఆరేండ్లుగా ఈ దరఖాస్తులు పెండింగు లో ఉండడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, కష్టాలు మంత్రికి తెలుసు. భూ భారతి చట్టం ద్వారా 9 లక్షల కుటుంబాలకు మేలు చేయాలని రూపకర్తలు నిర్ణయించారు. కానీ, గైడ్ లైన్స్‌లో క్షేత్రస్థాయి వాస్తవాలకు భిన్నంగా కొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు రూపొందించిన మార్గదర్శకాలు ఒక్క శాతం అప్లికేషన్లు కూడా పరిష్కరించేందుకు వీలు కల్పించలేదు. దీంతో రైతు సంక్షేమ కమిషన్ తరఫున చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్‌లు పలుమార్లు మంత్రి పొంగులేటి, సీఎం, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 20, 30 ఏళ్ల క్రితం అమ్మినోళ్లు ఇప్పుడు అఫిడవిట్ ఎలా ఇస్తారని సీఎం సైతం అభిప్రాయపడ్డారు. రెండు నెలల తర్వాత జీవో 76 విడుదల చేసినట్లు మంత్రి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

# ఉగ్రకుట్ర కేసు.. హైదరాబాద్‌కు చెందిన మహిళా అరెస్ట్

న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): నగరంలోని వించిపేటలో కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టి.. ఉగ్రవాద గ్రూపులకు సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్న ముగ్గురు యువకులు మహమ్మద్ రహమతుల్లా, డానిష్, సొహైల్ బేగ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్న అధికారులు విచారించారు. ఈ క్రమంలో ఈ ఉగ్రకుట్రలు హైదరాబాద్ కు పాకాయి.

దీంతో అప్రమత్తం అయిన కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సయిదా బేగం అనే మహిళను అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను టూటౌన్ పీఎస్ లో సయిదాబేగంను విచారిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ఉగ్ర లింకుల కేసులో సయిదా బేగం కీ రోల్ పోషించినట్లు అధికారులు గుర్తించారు. ఇదిలా ఉంటే 2025 జూన్ లో గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయడం తో అప్రమత్తం అయిన సయిదా బేగం అండ్ టీమ్.. పోలీసులకు తమపై ఎటువంటి అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో "అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్" పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు.

ఇందులో సోహైల్ బేగ్, షరీఫ్, డానిష్ తో పాటు 12 మంది ఈ గ్రూప్ లో ఉన్నారు. వెస్ట్ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీలో కార్యకలాపాలను నిర్వహించేందుకు ఈ గ్యాంగ్ సిద్ధమైనట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఈ గ్రూపులో మిగిలిన సభ్యులు అయిన బీహార్ వాసి దిల్కాష్ సహా మిగిలిన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా ఈ ఉగ్ర కార్యకలాపాలకు సంబంధించిన కేసు వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫైనాన్స్ బిల్లులో 53 సవరణలు..!

మొదటి పేజీ తరువాయి

**పన్ను అధికారుల భద్రత:** ఇంకా, పన్ను అధికారులు ఇచ్చిన ఆమోదాలు సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులో సవాలు చేయబడకూడదు అని సవరణల్లో పేర్కొన్నారు. దీని ద్వారా పన్ను శాఖ దావాదారులపట్ల లిటిగేషన్ లో బలమైన స్థితిలో ఉంటుంది.

ప్రోత్సాహకాలు మరియు మినహాయింపులు

SEZ (Special Economic Zone) కు సంబంధించిన పన్ను మినహాయింపులను కొన్ని సందర్భాల్లో 20 సంవత్సరాలుగా పొడిగించే ప్రతిపాదన సవరణల్లో ఉంది. దీనిలో Section 80LA కింద IFSC యూనిట్లను కూడా చేర్చారు. అంతేకాక, ఆంధ్రప్రదేశ్ భూ పూలింగ్ యోజన ప్రయోజనదారుల కోసం కాపిటల్ గెయిన్స్ పన్ను మినహాయింపును కూడా అందిస్తారు. అయితే, ఈ సవరణలు, 2025 మార్చి 31 నుంచి అమలులోకి వచ్చే కొత్త Income-tax Act, 2025కు సిద్ధమవుతున్న సందర్భంలో ప్రవేశపెట్టబడ్డాయి. ఈ కొత్త చట్టం, 1961 చట్టాన్ని రద్దు చేసి, పన్ను విధానాన్ని మరింత సరళతరం చేస్తుంది. మొత్తంగా ఈ సవరణలు పన్ను విధానాన్ని మరింత సమర్థవంతం చేసి, పన్ను శాఖకు పున:లెక్కింపుల పరంగా బలాన్ని ఇచ్చేలా రూపకల్పన చేయబడ్డాయి, అలాగే పన్ను చట్టం వినియోగదారులకు సులభతరం అవ్వడానికి దోహదపడతాయి.

# కన్న తల్లిని కిరాతకంగా చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టిన కుమార్తె..ఏడాది తర్వాత బయటపడ్డ నిజం!



న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కౌకూర్‌లో దారుణం చోటు చేసుకుంది. గత ఏడాది క్రితం అంజూ అనే మహిళ అదృశ్యమైనట్లు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అంజూ అదృశ్యంపై విచారణలో భాగంగా పోలీసులు పలు కోణాల్లో విచారించగా చిన్న కుమార్తె కూతురు ఇషికా, అల్లుడి కుమార్‌పై అనుమానాలు వచ్చాయి. లోతుగా విచారించగా సంచలన నిజాలు బయటకు వచ్చాయి. కన్న కూతురు, అల్లుడు తల్లిని కిరాతకంగా చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తేలింది. కన్న తల్లిని తానే హతమార్చినట్లు కూతురు ఇషికా పోలీసుల ఎదుట ఒప్పుకుంది. దీంతో ఘటన స్థలిలో మృతదేహాన్ని వెలికి తీస్తున్నారు పోలీసులు.. నిందితులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

# "అందుకే బంకుల్లో స్టాక్ ఖాళీ అవుతోంది" తెలంగాణ పెట్రోలియం డీలర్స్ బిగ్ వార్నింగ్




న్యూస్ డెస్క్, 25 మార్చి (క్రాంతి న్యూస్): తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై డీలర్స్ అసోసియేషన్ క్లారిటీ ఇచ్చింది. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి అమరేందర్ రెడ్డి పేరిట ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఇంధన కొరత లేదని, జనాలు పానిక్ అవ్వొద్దని స్పష్టం చేశారు. ఇంధన కొరత గురించి తప్పుడు, తప్పుదోవ పట్టించే వార్తలు ప్రచారం కావడం వల్ల చాలా మంది పెట్రోల్ బంకులకు పరుగులు తీసి అనవసరంగా తమ ట్యాంకులను నింపుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చిందని నోట్‌లో పేర్కొన్నారు. ఈ భయాందోళన కొనుగోళ్ల కారణంగా అమ్మకాలు సాధారణ స్థాయిల కంటే దాదాపు 2.5 నుంచి 3 రెట్లు అసాధారణంగా పెరిగాయన్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న అనేక రిటైల్ అవుట్‌లెట్లలో స్టాక్ తాత్కాలికంగా అయిపోయిందని పేర్కొన్నారు.

ఇంధనం కొరత లేదని, HPCL, IOCL, BPCL వద్ద తగినంత స్టాక్ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇంధన సరఫరా సాధారణంగానే కొనసాగుతోందన్నారు. అనంతరం కొందరికి వార్నింగ్ ఇచ్చారు. పెట్రోల్ లేదా డీజిల్ను డబ్బాలలో నిల్వ కోసం తీసుకువెళ్లడం PESO నిబంధనలకు విరుద్ధమని.. తీవ్రమైన భద్రతా ప్రమాదాన్ని కలిగిస్తుందని స్పష్టం చేశారు. ఇంధనాన్ని సరిగ్గా నిల్వ చేయకపోవడం అగ్ని ప్రమాదాలతో సహా ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయవచ్చని.. ఇది ఇంధనాన్ని నిల్వ చేయడానికి సురక్షితమైన లేదా ఆమోదించబడిన పద్ధతి కాదన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. భయాందోళనలకు గురికాకుండా ఇంధనాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ వార్తలను నమ్మవద్దు లేదా ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

KR TV క్రాంతి
తెలంగాణ
epaper.krtvnews.com

# రైతు సంక్షేమం నిరంతరం కృషి చేస్తాం.!!

**మండల కేంద్రంలో ఎఫ్.పి.ఒ నూతన కార్యవర్గం**

**ఎఫ్.పి.ఒ ద్వారా రైతన్నలకు యంత్రాలు**

**మండల ఎఫ్.పి.ఒ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కుంబాల నగేష్ రెడ్డి**




నారాయణరావుపేట(క్రాంతి న్యూస్) సాగులో నూతన పద్ధతుల పై అవగాహన కల్పిస్తూ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తానని బుగ్గ రాజేశ్వర రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం చైర్మన్ కుంబాల నగేష్ రెడ్డి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎఫ్.పీ.ఒ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల నగేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఎఫ్.పీ.ఒ ద్వారా విత్తనోత్పత్తి చేసి నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రణాళిక చేస్తామన్నారు. ఎఫ్. పీ.ఒ ద్వారా రైతులకు హర్వెస్టర్, వడ్లు ఆరబెట్టే యంత్రం, గడ్డి కట్టలు కట్టే యంత్రం, స్ప్రేయర్ వంటి సౌకర్యాలు సభ్యులకు అందేలా చూస్తామని చెప్పారు. సంఘం లావాదేవీలు ఎప్పటికప్పుడు ప్రతి సభ్యునికి తెలిసేలా చేస్తామని హామి ఇచ్చారు. ఎఫ్.పీ.ఒ సేవలు అన్ని గ్రామాలకు అందించడం పాటు ప్రతి నెలా ఒక్కో గ్రామంలో సమావేశం నిర్వహించి సంఘం పరిధిని మరింత విస్తృతం చేస్తామని, ఎలాంటి అవినీతికి తావివ్వకుండా సభ్యులందరికీ జవాబుదారిగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అజయ్ రెడ్డి,పెద్ది బిక్షపతి, పుర్ర రాజయ్య, బాలాపోచయ్య, సుతారి వెంకట్, బాల్ రెడ్డి, మహంకాళి బిక్షపతి, శ్రీనివాస్, దేవి రెడ్డి, కొంగరి నారాయణ, భూంరెడ్డి, రాంచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించాలి: జిల్లా కలెక్టర్



నవాబ్ పేట్, మార్చి 25 (క్రాంతి న్యూస్): విద్యార్థులను ప్రతి సబ్జెక్టుపై పరిపూర్ణంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోధన సిబ్బందికి సూచించారు. బుధవారం నవాబ్ పేట్ మండలంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసిల్దార్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించి, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని అన్నారు. ముందుగా పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టిక, సైన్స్, ఫిజిక్స్ ల్యాబ్‌లు, క్రీడా సామాగ్రి, ఎంబ్రాయిడింగ్, కుట్టు పనులు నేర్పించే గదులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రజలకు పూర్తి స్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ప్రజల్లో ఎక్కువగా ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే బార్ అసోసియేషన్ ఎన్నికలు




ఖమ్మం, 25 మార్చి (క్రాంతి న్యూస్): తెలంగాణా బార్ కౌన్సిల్ ఇచ్చిన సర్కులర్ ప్రకారం ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ 2026-27 సంవత్సరానికి గాను మార్చి 26 న ఎన్నికలు జరుగబోతున్నాయి. ప్రెసిడెంట్, సెక్రటరీ పోస్టులు తప్ప మిగిలిన పోస్టులు అన్నీ ఏకగ్రీవంగా ఎన్నికవడం జరిగింది. ప్రెసిడెంట్ గా మోజెస్ క్రిస్టోఫర్, యడ్లపల్లి రమేష్, వెంకటేశ్వర రావు గుప్తా, విజయ రాఘవ మరియు కార్యదర్శి పదవికి కందుల అమరనాథ్, కొప్పుల రవి కుమార్, తాళ్ల వెంకట నారాయణ పోటీలో ఉన్నారు. ఎన్నికల పోలింగ్ సమయం ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 వరకు బార్ అసోసియేషన్ హాల్ లో పోలింగ్ జరుగుతుందని, న్యాయవాదులు తమ ఓటర్లు ఓటర్ ఐడి తీసుకొని రావాలని సెల్ ఫోన్ పోలింగ్ బూత్ లోకి తీసుకుని రాకూడదని. పోలింగ్ ఏర్పాట్లు అన్నీ పూర్తి అయినాయని, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, వారి అనుచరులు సహకరించాలని ఎన్నికల అధికారులు శేఖర్ రాజ్, తౌఫిక్, మారగాని శ్రీనివాసరావు, పద్మనాభుల వెంకన్న లు కోరారు.

# పాలకుల వివక్ష కు వ్యతిరేకంగా... కదంతొక్కిన కలం కార్మికులు

- **ఐఅండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడి**
- **జర్నలిస్టుల ర్యాలీ, ధర్నాతో దద్దరిల్లిన సమాచార భవన్**
- **విజయవంతంగా ఛలో హైదరాబాద్**
- **వివక్ష విడనాడకపోతే రాష్ట్రవ్యాపిత ఆందోళన**
- **టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**




కుత్బుల్లాపూర్, 25 మార్చి (క్రాంతి న్యూస్): జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా అనేక మంది జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐఅఃడ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్"కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం

ఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ, పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడు జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ రాష్ట్ర కో- కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్,కృష్ణమాచారి, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కే. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి, కో- కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, సంతోష్, బ్రహ్మం,మహిళా నాయకులు సాజిదా, మంజులారెడ్డి, శివపార్వతి, సుస్మిత, తీగవరపు శాంతి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు నియోజకవర్గ రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు

# జగద్గిరిగుట్టలో బస్ డిపోను ఏర్పాటుచేయాలి- ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలి : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, 25 మార్చి (క్రాంతి న్యూస్): బడ్జెట్ సమావేశాల్లో 2026-27 ల్లో భాగంగా హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా అభివృద్ధిపై నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట లో అధునాతన బస్ టెర్మినల్ ను నిర్మించాలి. జగద్గిరిగుట్ట ప్రాంతం నుంచి నగరంతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు బస్సు ప్రయాణం చేస్తూ ప్రయాణిస్తూ ఉంటారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే బస్సులు రాత్రి వేళలో హాల్ట్ అవడంవల్ల సరైన సదుపాయాలు లేక రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి. అంతేకాక ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎటువంటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి జగద్గిరిగుట్ట పైప్ లైన్ రోడ్డులోని సర్వే నెంబర్. 223,224, 237 & 238 లోగల ప్రభుత్వ భూమి బస్ డిపోకు అనుగుణంగా ఉండడంవల్ల ఈ ప్రభుత్వ భూమిని డిపోకు కేటాయించి అభివృద్ధి పరచాలి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాలకు సరైన ప్రజా రవాణా సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున నియోజకవర్గంలోని వివిధ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజా రవాణా లో భాగంగా... బాచుపల్లి, నిజాంపేట్ నుంచి సికింద్రాబాద్ ( వయా ప్రగతి నగర్, జేఎన్టీయూ, గండిమైసమ్మ), మెహిదీపట్నం (వయా జేఎన్టీయూ), మియాపూర్ టు కూకట్ పల్లి (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) మియాపూర్ - సికింద్రాబాద్ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) మియాపూర్ టు గండిమైసమ్మ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయి నగర్ బాచుపల్లి) బాలయ్య నగర్ నుంచి బాలానగర్, కెపిహెచ్బి నుంచి బాలయ్య నగర్ కు బస్సు సదుపాయం ఏర్పాటు చేయాలి. లాల్ సాహెబ్ గూడ నుంచి సికింద్రాబాద్ కు అదనపు బస్సు సర్వీసు. నూతన బస్సు సర్వీసు - 224/జి, మియాపూర్ నుంచి మేడ్చల్ వయా ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్మెంట్స్, బహదూర్ పల్లి. పునః ప్రారంభం - 229ఎల్ - నాగులూరు నుంచి మేడ్చల్. బస్సు రూట్ పరిధి పెంపులో భాగంగా బస్ నెంబర్ 195, 195పి, 195 ఎం-జి ( ప్రగతి నగర్ కమాన్ నుంచి మల్లంపేట్ వయా బొడ్డు రాయి, శంబీపూర్), బస్ నెంబర్ 229 - సికింద్రాబాద్ - బహదూర్ పల్లి బస్సును బౌరంపేట్ క్రాస్ రోడ్ వరకు పొడిగించాలి.అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, వినతిపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్, త్వరలోనే జగద్గిరిగుట్టలో అధునాతన బస్ టర్మినల్ తో పాటు బస్ డిపో ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి బస్ డిపో ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, తో పాటుగా నగరానికి చెందిన ఎమ్మెల్యేలు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థి యువత భగత్ సింగ్ మార్గంలో ముందుకు రావాలి



**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్:** దేశంలో మతోన్మాద, ఫాసిస్టు విధానాలు మరియు అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థి, యువత ఉద్యమించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా కార్యదర్శులు జక్కుల భారత్, వంగూరి వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), పీవైఎల్, పీఓడబ్ల్యూ, టీయూసీఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి స్మారక వారోత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రత్యేక ఫోటో గ్యాలరీని ఏర్పాటు చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చరిత్రను ప్రతిబింబించే చిత్రాలతో ఏర్పాటు చేసిన ఈ గ్యాలరీకి వాకర్స్ మరియు ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. భగత్ సింగ్ పేరుతో కొందరు మతోన్మాద శక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఆయన సోషలిస్టు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారే నిజమైన వారసులని స్పష్టం చేశారు. దేశంలో ప్రభుత్వం విద్యా రంగం పట్ల నిర్లక్ష్యం చూపుతూ, గుడుల అభివృద్ధిపై అధిక ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విశ్వవిద్యాలయాల్లో సామాజిక శాస్త్రాల ప్రాముఖ్యతను తగ్గిస్తూ, కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలమైన కోర్సులను ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థి, యువతను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మలిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయంగా అమెరికా ఆధ్వర్యంలో జరుగుతున్న యుద్ధోన్మాద చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులను ప్రజలంతా నిరసించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలపై సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను ఎదుర్కోవడానికి యువత ముందుకు రావాలని కోరారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల ఆశయాల సాధన కోసం కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజ నిర్మాణానికి విద్యార్థి, యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పరపు లక్ష్మణ్, టీయూసీఐ జిల్లా నాయకులు పూలయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు ఝాన్సీ, పీడీఎస్‌యూ నాయకులు స్టాలిన్, శ్రవణ్, పీవైఎల్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

## బొలిశెట్టికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్న జనసేన.. ధన్యవాదాలు తెలిపిన సత్యనారాయణ




జనసేన JANASENA

25.03.2026

ప్రకటన

శ్రీ బొలిశెట్టి సత్యనారాయణకు జనసేన పార్టీతో ఎటువంటి అనుబంధం లేదని తెలియచేస్తున్నాము. ఆయన తన వ్యక్తిగత సిద్ధాంతాలను అనుసరించే నిమిత్తం పదవి బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అంగీకరించారు. శ్రీ బొలిశెట్టి సత్యనారాయణ చేపట్టే కార్యక్రమాలకి పార్టీకి సంబంధం లేదు.

- జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం,
మంగళగిరి.

ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): బొలిశెట్టి సత్యనారాయణకు పార్టీతో ఇకపై ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది జనసేన పార్టీ.. ఆయన పదవుల నుంచి తప్పుకోవాలన్న అభ్యర్థనను పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అంగీకరించినట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇకపై బొలిశెట్టి సత్యనారాయణ నిర్వహించే కార్యక్రమాలకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం ఉండదని పేర్కొంది.. ఆయన స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకోవడంతో వెంటనే విముక్తి కల్పించినట్లు వెల్లడించింది.

జనసేనకు బొలిశెట్టి ధన్యవాదాలు

ఇక, జనసేన పార్టీ నిర్ణయంపై స్పందించిన మాజీ జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ.. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ మరియు మానవ హక్కుల కోసం మరింత చురుకుగా పనిచేయాలనే తన అభ్యర్థనను గౌరవించి, బాధ్యతల నుంచి విముక్తి కల్పించారని అన్నారు.. పార్టీతో అధికారికంగా దూరమైనప్పటికీ, సిద్ధాంత పరంగా అనుబంధం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ దిశగా పని చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై దృష్టి

కొల్లేరు సరస్సు రక్షణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చిత్తడి నేలల పరిరక్షణ, భూ వినియోగ మార్పిడి నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సత్యనారాయణ సూచించారు. పర్యావరణ ప్రభావ అంచనాలు లేకుండా జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు. పర్యావరణ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ అంశాల్లో చొరవ చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా, బొలిశెట్టి సత్యనారాయణ పార్టీ బాధ్యతల నుంచి వైదొలగినప్పటికీ, పర్యావరణ పరిరక్షణ దిశగా తన సేవలను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

## కేంద్ర జలశక్తి కార్యదర్శికి మంత్రి నిమ్మల కీలక సూచనలు



ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పోలవరం ప్రాజెక్టు పనుల సమీక్ష సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావును మర్యాదపూర్వకంగా కలసి ప్రాజెక్ట్ ప్రగతిపై చర్చించారు. మంత్రి నిమ్మల ప్రకారం, కేంద్రప్రభుత్వం సహకారంతో పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రాజెక్ట్ నిర్మాణంతో పాటు నిర్వాసితుల కోసం సహాయం మరియు పునరావాస పనులు కూడా సమాంతరంగా వేగవంతం చేశామని మంత్రి పేర్కొన్నారు.

పెండింగ్ డిజైన్లకు అనుమతులు

ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన పెండింగ్ డిజైన్లకు వెంటనే అనుమతులు ఇవ్వాలని మంత్రి నిమ్మల.. కేంద్రమంత్రి కార్యదర్శి కాంతారావుకు సూచించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువలు 17,500 క్యూసెక్కుల సామర్థ్యానికి రియంబర్స్మెంట్‌లో సహకరించాలని హితవు చేశారు. ఇక, వృధాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరద జలాలను వినియోగించడానికి, పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టుకు తక్షణమే సాంకేతిక మరియు ఆర్థిక అనుమతులు ఇవ్వాలని మంత్రి నిమ్మల అభ్యర్థించారు. ప్రతీ సంవత్సరం సగటున 3వేల టిఎంసి నీరు బంగాళాఖాతంలో కలసిపోతుందని మంత్రి వివరించారు.

రక్షణ మరియు నదుల ఏటి గట్ల పటిష్టత

తుఫానులు, సముద్రపు కోతల వల్ల తక్షణ రక్షణ అవసరమయ్యే ప్రాంతాలకు సహాయం చేయాలని సూచించారు. గోదావరి, కృష్ణ, పెన్నా, వంశధార, నాగావళి వంటి నదుల ఏటి గట్ల పటిష్టత కోసం కూడా సహకరించమని సూచనలు చేశారు. డెల్టా డ్రైన్స్, సముద్రంలో కలిసే ముఖద్వారాల వద్ద పూడిక తీయడం, వెడల్పు పెంపుకు నిధులు అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.. ఇక,

ఆల్మట్టి డ్యామ్ ఎత్తు సుప్రీంకోర్టు పరిధిలో ఉండటం వల్ల, ఆర్ అండ్ ఆర్, భూ సేకరణ వంటి వాటికి కర్ణాటక రాష్ట్రం ముందుకు వెళ్లకుండా సహకరించమని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

కేంద్ర పాక్షిక ప్రతిజ్ఞ

అయితే, కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు RRR, PMKSY, ఫ్లడ్ మానేజ్మెంట్ వంటి ఇతర పనులకు సహకరిస్తామని తెలిపారు. మొత్తం విషయాన్ని చూస్తే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నీటి వినియోగం, నిర్వాసితుల పునరావాసం మరియు నదుల ఏటి పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రభుత్వం చర్యలతో ముందుకు వెళ్తోంది.

## అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమావేశంలో వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు.. ఇది శుభపరిణామం..!



ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): అద్దంకి నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

అద్దంకి గెలవగల నియోజకవర్గమే

అద్దంకి నియోజకవర్గం గెలవలేనిది కాదని స్పష్టం చేశారు వైఎస్ జగన్.. ప్రస్తుత ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. జగన్ అమలు చేసిన పథకాలను రద్దు చేసి, తాను ప్రకటించిన "సూపర్ సిక్స్", "సూపర్ సెవెన్" హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు.

పునర్విభజనపై జగన్ స్పందన

నియోజకవర్గాల పునర్విభజనను శుభపరిణామంగా అభివర్ణించారు వైఎస్ జగన్... మహిళలకు రిజర్వేషన్లు పెరగడం సంతోషకరమని తెలిపారు. తమ పాలనలోనే మహిళలకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. కొత్త సీట్ల పెరుగుదలతో పార్టీ కార్యకర్తలకు నాయకత్వ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

అప్పులు, సంక్షేమంపై వివరణ

తమ ప్రభుత్వ కాలంలో చేసిన అప్పులపై కూడా జగన్ వివరణ ఇచ్చారు. ఐదేళ్లలో రూ.3.31 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, అందులో రూ.2.72 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళ్లాయని తెలిపారు. ఆధార్, బ్యాంక్ ఖాతాల ఆధారంగా ప్రతి రూపాయి ఎవరికి ఇచ్చామో చెప్పగలమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల లోపే రూ.3.37 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని ఆరోపించారు. ఇక, ప్రస్తుత పాలనలో అవినీతి విస్తృతంగా పెరిగిందని జగన్ ఆరోపించారు. లిక్కర్, ఇసుక, మట్టి, సిలికా, గ్రానైట్ రంగాల్లో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. అమరావతి నిర్మాణాల్లో కూడా భారీ అవినీతి జరుగుతోందని, చదరపు అడుగుకు అధిక ఖర్చులు చూపుతున్నారని పేర్కొన్నారు.


పెట్టుబడులపై క్రెడిట్ దోపిడీ ఆరోపణ

పెట్టుబడుల విషయంలో కూడా ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ దోపిడీ చేస్తోందని జగన్ అన్నారు. ాతీఎవశ్రీశీతీవీఖ్రీ స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టులు తమ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు వాటిని ప్రస్తుత ప్రభుత్వం తమదిగా చూపిస్తోందని విమర్శించారు. అలాగే గూగుల్, బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదని, మొక్కజొన్న, శెనగ, అరటి, టమోటా వంటి పంటలకు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడంతో విద్యార్థులు చదువులు మానేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు భరోసా

"జగన్ 2.0"లో కార్యకర్తలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు జగన్. పార్టీ కోసం కష్టపడే వారికి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యకర్తల ద్వారా ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. మొత్తంగా, అద్దంకి సమావేశంలో జగన్ ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూనే, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలపై సంకేతాలు ఇచ్చారు.

## హైదరాబాద్‌లో ఉద్యోగం.. అరకులో దారుణ హత్య.. భార్య గర్భవతి..




ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. అరకులోయ పంచాయతీ పరిధిలోని రూప రిసార్ట్స్ వద్ద ఒక యువకుడి హత్య జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడు నాగేళ్ల సురేష్, 25 సంవత్సరాలు, విజయనగరం జిల్లా తెర్లాం మండలం జన్నివలస గ్రామానికి చెందినవాడు. పోలీసుల సమాచారం ప్రకారం, ఈ హత్య యువతి కోసం జరిగిన ఘర్షణ కారణంగా జరిగినట్లు అనుమానం ఉంది. హెల్మెట్‌తో కొట్టి, తర్వాత కత్తితో పొడిచి హత్య చేశారు.. ఈ ఘటనలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇక, ఘటనా స్థలానికి అల్లూరి జిల్లా డీఎస్పీ పాడేరు అభిషేక్ చేరి కేసును పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడు హైదరాబాద్‌లోని ఓ జువెలరీ షాపులో ఉద్యోగం చేస్తున్నాడు.. అయితే, అతను గతంలో అరకులోయ రిసార్ట్స్‌లో కూడా పని చేసేవాడు. మరిన్ని వివరాల ప్రకారం, మృతుని భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉంది. ప్రాథమిక దర్యాప్తులో గంజాయి మత్తులో గొడవ జరిగి హత్యకు దారితీసినట్లు వెల్లడైంది. పోలీసులు ఘటనపై పూర్తి వివరాలను సేకరించి, నిందితులపై తగిన చర్యలు చేపట్టనున్నారు.

## ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు.. ముగ్గురు స్పాట్ డెడ్




ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): కర్నూల్ జిల్లాలో ఒకే చోట జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. చెన్నమ్మ సర్కిల్ వద్ద జరిగిన ఈ ప్రమాదాలు రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వేగంగా వచ్చిన ఓ లారీ పాదచారిని ఢీ కొట్టగా అతను అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వెంటనే అతడికి సహాయం చేసేందుకు వెళ్లారు. అప్పటికే చనిపోవడంతో పోలీసులు, అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంతలోనే మరోలారీ వేగంగా వారిపైకి దూసుకొచ్చింది.

ఇలా రోడ్డుప్రమాదంలో ఒకరికి సహాయం చేయబోయి మరో ఇద్దరు వ్యక్తులు కూడా స్పాట్లో చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదాలను కళ్లారా చూసినవారు.. మంచి అన్నివేళలా కాపాడుదంటూ.. కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రమాదాలకు కారణమైన రెండులారీల డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నంద్యాలలో మరో ప్రమాదం

మరోవైపు నంద్యాల వద్ద జాతీయ రహదారిపై మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ కు చెందిన బస్సు ప్రమాదానికి గురైంది. టైరు పేలిపోవడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బస్సు అధికవేగంతో వెళ్తుండటం వల్లే డ్రైవర్ పట్టుకోల్పోయినట్లు సమాచారం. పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి.. క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఒంటిమిట్టలో శ్రీరాముని కల్యాణ మహోత్సవాలు ప్రారంభం.. కల్యాణ ముహూర్తమిదే



ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి గాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన 'హరిద్రా ఘటనం' (పసుపు దంచే కార్యక్రమం) తో ఈ వేడుకలు కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

కల్యాణ వేడుకల సందర్భంగా స్వామివారికి మరియు అమ్మవార్లకు పట్టువస్త్రాలు, దివ్యాభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. గర్భాలయంలో స్వామివారి పాదాల చెంత పసుపు కొమ్ములు, రోళ్లు – రోకళ్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఈ కార్యక్రమం సాగింది. సంప్రదాయబద్ధంగా మహిళా భక్తులు రోలులో పసుపు కొమ్ములను దంచి, కల్యాణానికి కావలసిన పసుపును సిద్ధం చేశారు. ఈ పసుపునే స్వామివారి కల్యాణంలో వినియోగిస్తారు. పసుపు దంచుతున్న సమయంలో భక్తులు చేసిన 'జైశ్రీరామ్' నామస్మరణతో కోదండ రామాలయ ప్రాంగణం మారుమోగిపోయింది. చైత్రశుద్ధ చతుర్దశి, ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల మధ్య సీతారామ కల్యాణోత్సవం నిండు వెన్నెలలో కన్నులపండువగా జరగనుంది. అదేరోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఏపీలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో వార్డులు పెంచుతూ జీవో జారీ




ఏపీ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కసరత్తులు మొదలుపెట్టింది ఏపీలోని కూటమి సర్కార్. ముందుగా చెప్పినట్లుగానే మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న స్థానాలను పెంచేసింది. ఈ మేరకు రెండు జీవోలు 64,65 విడుదల చేసింది ఏపీ సర్కార్. జనాభా ప్రాతిపదికన వార్డులు/డివిజన్లను పెంచింది. ఇక ఈ పెంపుతో ఈ సారి పోటీదారులకు భారీ ఊరట లభించనుంది.

వార్డులు, డివిజన్ల స్థానాల పెంపుతో పోటీ చేసే ఆశావాహులకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రానున్న లోకల్ బాడీ ఎన్నికలలోపు వీటిని అమలు చేయబోతున్నారు. ఈ మేరకు కసరత్తులు చేసి, వార్డులు డివిజన్లను ఏ విధంగా సిద్ధం చేయాలనే దానిపైన అన్ని రూట్ మ్యాప్ సిద్ధం చేసారు. ఇందులో భాగంగానే.. మున్సిపాలిటీ, నగర పంచాయతీ, కార్పొరేషన్ల కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది సర్కార్. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తొర్రూర్, 25 మార్చి (క్రాంతి న్యూస్): తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన చిర్రబోయిన ప్రభాకర్ (38) అనారోగ్యంతో ఇటీవల అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది.

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం కిషోర్ రెడ్డి ముందుకు వచ్చారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ నలుగురి రామలింగం బుధవారం కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కిషోర్ రెడ్డి తరపున రూ.12,000 నగదు, ఒక క్వింటా బియ్యం అందించగా, గ్రామస్తులు సైతం మానవత్వాన్ని చాటుకుంటూ రూ.8,500 నగదు సేకరించి కుటుంబానికి అందజేశారు. మొత్తం రూ.20,500 సహాయం అందింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు కష్టసుఖాల్లో రామసహాయం కిషోర్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారు. ప్రభాకర్ అకాల మరణం బాధాకరం. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి వ్యక్తిగతంగా సహాయం కొనసాగిస్తాం" అని తెలిపారు.

రామసహాయం కౌసల్యాదేవి నారాయణరెడ్డి, అశోక్ రెడ్డి, నితిన్ రెడ్డి జ్ఞాపకార్థం మడిపల్లి గ్రామ ప్రజలకు రూ.55,000 విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. ఈ ఫ్రీజర్ బాక్స్ ద్వారా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో మృతదేహాన్ని భద్రపరచడం సులభమవుతుందని సర్పంచ్ నలుగురి రామలింగం తెలిపారు. గతంలో ఇలాంటి సౌకర్యం లేక దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వచ్చేదని, ఈ విరాళం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధుషా ఉపేందర్, కేతిరెడ్డి పాపిరెడ్డి, నరసింహారెడ్డి, రావుల అనిల్ రెడ్డి,నలమాస సంపత్ కుమార్, శ్రీనివాస్, హనుమంతు, కొమరయ్య, బాల్య అశోక్, వేర్పుల వెంకటస్వామి, వేర్పుల రమేష్, గడీల పుల్లయ్య, లోక్కుంట్ల రాములు, మందుల యాకన్న, వార్డ్ సభ్యులు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పసుపు కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

### ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

### నేడు రాముల వారి కళ్యాణ అక్షతలు కలుపుట



తొర్రూరు, 25 మార్చి (క్రాంతి న్యూస్): డివిజన్ కేంద్రంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ పాటిమీద ఉన్న శ్రీ సీతారామ మందిరం వద్ద ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణ వసంత నవరాత్ర త్రయహ్నిక మహోత్సవాలు లలో భాగంగా బుధవారం రోజున ఉదయం ముత్తైదువులచే పసుపు కొట్టే కార్యక్రమం అనంతరం విశ్వక్సేన పూజ కలశ స్థాపన తో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యా యన్నారు.. సాయంత్రం తొర్రూరు సౌందర్యలహరి సమూహము వారిచే సౌందర్యలహరి పారాయణం అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం.నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి వారి కళ్యాణ తలంబ్రాలు కలుపుట మధ్యాహ్న సాయంత్రం పూజ నాతోపాటు వికాసతరంగిణి తొర్రూరు వారిచే విష్ణు సహస్రనామం పారాయణం అనంతరం సుందర సత్సంగ్ వారిచే భజన, భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నామని శుక్రవారం ఉదయం 6 గంటలకు రజకుల పూజ 9 గంటలకు రామ మందిరం నుండి మంగళ వాయిద్యాలతో ఉత్సాభివృద్ధి సమేతంగా బయలుదేరి 10 గంటలకు శివాలయం వద్ద కార్యక్రమం అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహిస్తున్నా మని అన్నారు. కల్యాణం అనంతరం క్యూ లైన్ లో స్వామివారి అక్షితలు ,తీర్థప్రసాద వితరణ సాయంత్రం హోమము పూర్ణాహుతి అనంతరం శ్రీ సీతారామచంద్రమూర్తి పరిపాల సమేతంగా పట్టణ వీధుల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నామని అన్ని వ్యాపార వర్గాల సోదరులు సభ్యులు భక్తులు అధికంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తూ శ్రీ సీతారామచంద్ర కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రపాణి చలువది సత్యనారాయణ , ప్రధాన కార్యదర్శి తల్లాడ హీరాధార్ ఇతర కమిటీ సభ్యులు మచ్చ లక్ష్మయ్య, గోపారపు చంద్రమౌళి, మాశెట్టి రమేష్ ఇమ్మడి రాంబాబు , రేగూరి శ్రీనివాస్ , శ్రీధర్, బోనగిరి వెంకన్న , చిత్రపు పురుషోత్తం మహిళలు వికాస తరంగిణి అధ్యక్షురాలు కుందూరు గీతారెడ్డి ప్రసూన శోభ, రేణుక , శోభ,మంజుల అనుపమ సౌందర్యలహరి పారాయణ నిర్వాహకురాలు పావని , ఖ్యాతి,పద్మ , సౌమ్య,తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి లో ఎఫ్3 గేమింగ్ జోన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ




కూకట్ పల్లి, 25 మార్చి (క్రాంతి న్యూస్): కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ లోని పిఎన్ఆర్ మాల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్3 గేమ్ జోన్ ను శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ మీరు ఏర్పాటు చేసిన ఈ ఎఫ్ త్రీ గేమ్ జోన్ చాలా బాగుందని ఇక్కడికి వచ్చిన పిల్లలకు పెద్దలకు అన్ని రకాల గేమ్స్ ఆడుకుంటూ వారికి కావాల్సిన ఫుడ్ కూడా తినే విధంగా అన్ని రకాల స్టాల్స్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని మీరు ఏర్పాటు చేసుకున్న ఈ గేమ్ జోన్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నట్టు తెలియజేశారు. ఎఫ్ 3 నిర్వాహకులు మాట్లాడుతూ కెపిహెచ్బిలోని పిఎన్ఆర్ మాల్ లో 16 వేల ఎస్ఎఫ్టిల సువిశాలమైన ప్రదేశంలో అన్ని రకాల గేమ్స్ ఏర్పాటు చేశామని ఇక్కడికి వచ్చిన పేరెంట్స్ పిల్లలు కూడా ఎంతో చక్కగా ఆటలాడుకుంటూ వారికి కావలసిన ఆహారాన్ని కూడా రుచికి చూసే విధంగా ఈ ఎఫ్ త్రీ గేమ్ జోన్ ను తయారు చేయడం జరిగింది అన్నారు ఇక్కడికి వచ్చిన పిల్లలు చాలా సంతోషంగా ఫీల్ అవుతారని వాళ్ళ జీవితంలో ఒక బెస్ట్ ప్రదేశానికి వెళ్లిన ఫీలింగ్ కలుగుతుందని మేము గంటాపతంగా చెప్పగలమన్నారు. ఈ ప్రారంభోత్సవంలో సినీ నటులు హిషిత రెడ్డి. సాగర్ శైలేష్. ఎఫ్ త్రీ గేమింగ్ జోన్ వ్యవస్థాపకుడు బొల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూర్ పట్టణ పదవ వార్డు అంగన్వాడి భవన నిర్మాణానికి స్థల సేకరణ గురించి కలెక్టర్ ను కలిసిన కౌన్సిలర్



తొర్రూరు, 25 మార్చి (క్రాంతి న్యూస్): మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో అంగన్వాడి కేంద్రం నిర్వహణకు శాశ్వత అంగన్వాడి భవన నిర్మాణానికి స్థల సేకరణ చేయించాలని పదవ వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్ కోరారు. బుధవారం తొర్రూరు మున్సిపాలిటీ లో కలెక్టర్ స్నేహ శబరీష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ముద్దసాని సురేష్ మాట్లాడుతూ పదవ వార్డులో అంగన్వాడి భవనం లేక కిరాయి భవనంలో సరైన సౌకర్యాలు లేవన్నారు. చిన్నారులు,గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా రోజులగా సొంత భవనం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. భవన నిర్మాణానికి స్థలం లేక భవన నిర్మాణం జరగడం లేదన్నారు. స్పందించి అంగన్వాడి భవన నిర్మాణానికి స్థల సేకరణ చేసి నిధులు కేటాయించి నిధులు మంజూరు చేయించి భవనం నిర్మించాలని కోరారు. కలెక్టర్ స్పందించి త్వరలోనే స్థల సేకరణ చేసి నిధులు మంజూరు చేసి అంగన్వాడి భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



MUDDASANI SURESH
10th Ward councillor, Thorrur
#8-9, Near Municipality Office, Vill. & Mdl. Thorrur, Dsit. Mahabubabad. Telangana. 506 163.
Cell : 9985424567
E-Mail : m4629833@gmail.com

Reff.
Date : 25 / 03 / 2026

10వ వార్డు కౌన్సిలర్

## మంత్రి కొండా సురేఖని కలిసిన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి



పాలకుర్తి, 25 మార్చి (క్రాంతి న్యూస్): మండలం కేంద్రం లోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి సంబంధించిన పలు పనుల ప్రతిపాదనలను మంత్రి కి వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించిన ఎమ్మెల్యే ముఖ్యంగా కాలినడక మార్గం, మెట్లు, పాత్‌వే, కళ్యాణ మండపం నిర్మాణం, అఖండ జ్యోతి, 200 కిలోలీటర్ల సంప్ వంటి మౌలిక వసతుల అవసరాన్ని ప్రస్తావించారు. ఈ పనుల కోసం మొత్తం రూ.4.65 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ అధికారిక లేఖను మంత్రి కి అందజేశారు. ఆలయ అభివృద్ధి జరిగితే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రాంతీయంగా ఆధ్యాత్మిక పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వినతిని స్వీకరించిన మంత్రి కొండా సురేఖ సమస్యను సానుకూలంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## బాధలో భరోసానిస్తున్న అల్లం బాలకిషోర్ రెడ్డి



గీసుకొండ, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఊకల్ గ్రామానికి చెందిన మొగసాని నాగరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి స్పందించి, 10,000 ఆర్థిక సహాయం అందజేయడం గొప్ప మానవత్వానికి నిదర్శనం. అంతేకాకుండా, ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పడం వారి సేవాభావాన్ని మరింత తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోగసాని సంపత్ నాగదేవత, మాదాసి రాంబాబు, తుప్పరి ఉదయ్, యాగోని రజనీకాంత్, బోయ అశోక్, చిన్న పెల్లి రవీందర్, మెడ సురేష్, నాగరాజు, కలకోటి శ్రీకాంత్, జయప్రకాష్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి






రామాంతాపూర్, 25 మార్చి (క్రాంతి న్యూస్): రామాంతాపూర్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీకి చెందిన మల్లెపల్లి మహేష్ గౌడ్ కుమారుడు అజయ్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60 వేల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు ఎల్ఓసీ పత్రాన్ని కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, కాలనీ సభ్యులు వారి బృందం సభ్యులు కలిసి బాధితుడి తండ్రి మహేష్ గౌడ్ కు అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సహకారంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఎల్ఓసీ పొందడంతో పాటు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయ్యిందని తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడికి నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రమేష్ గౌడ్, గౌరవ సలహాదారులు రవి ,సంజీవ, స్వామి, శంకర్, టీం సభ్యులు ఆర్. గోవింద్, అశోక్, నవీన్, రామకృష్ణ , విద్యాసాగర్, నరసింహ, శివ, శ్రీనివాస్ గౌడ్, ఐలేష్ యాదవ్, వీర బ్రహ్మాచారి కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## కింగ్డమ్ ఆఫ్ క్రిస్ట్ మినిస్ట్రీస్ ఎన్జీవో సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం సొసైటీ ప్రెసిడెంట్ బిషప్ క్రీస్తు రాజు



కుత్బుల్లాపూర్, 25 మార్చి (క్రాంతి న్యూస్): షాపూర్ నగర్ పరిధిలోని కింగ్ డామ్ ఆఫ్ క్రిస్ట్ మినిస్ట్రీస్ ఎన్జీవో సొసైటీ ప్రెసిడెంట్ బిషప్ క్రీస్తు రాజు, ఆధ్వర్యం లో గాంధీ హాస్పటల్ దగ్గర 500 మంది కి అన్నదాన కార్యక్రమం జరిగింది మా సొసైట్ తరుపున ఇలాంటి కార్యక్రమాలు చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది అని ఇంకా ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆశిస్తునం అని సొసైటీ ప్రెసిడెంట్ బిషప్ క్రీస్తురాజు అన్నారు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ బీదలకు ఏ అవసరం ఉన్నా మా సొసైటీని సంప్రదిస్తే మేము వారికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు మా ఫోన్ నెంబర్ 9704090069 కు సంప్రదిస్తే వారికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సొసైటీ ట్రెజరర్ శకుంతల, ఎస్తేర్ రాణి, ఆంథోనీ, డేవిడ్, ప్రభాకర్,సువర్ణ, లక్ష్మీ, భాస్కర్, రాజ్యలక్ష్మి, పద్మా,స్వర్ణ, కుమార్, వీరయ్య, ఖషమ శంకర్, శ్రీనాథ్, సుధీర్ వర్మ, ప్రకాశ్ వర్మ, మేరీ, సుభాషిణి, సబిత, జీవన్ డానీ, ప్రవీణ్, మహిపాల్ రెడ్డి, రిషిత్ వర్మ, వారి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## పశువుల గాలికుంటు టీకాలు ప్రారంభించిన సర్పంచ్ రాజమహేందర్ రెడ్డి



వనపర్తి, 25 మార్చి (క్రాంతి న్యూస్): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యం బుధవారం అల్వాల్ గ్రామములో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్నీ గ్రామ సర్పంచ్ రాజమహేందర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది.డాక్టర్ శ్యామ్ మట్లాడుతూ..3 నేలల వయస్సు కలిగిన దూడల నుండి అన్నీ పాడి పశువులు గేదెలకు టీకా వెయిచుకోని పశు సంపదను కాపాడుకోవాలని రైతులకు సూచించారు.గాలికుంటూ రోగం వస్తే పశువులు పాల దిగుబడి తగ్గి అర్థిక నష్టం జరుగుతుండి మరియు దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.ఇది రైతులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమములో మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ మరియు సిబ్బంది రాజేష్,మాధవయ్య,రవి గోపాలమిత్ర మరియు పాడి రైతులు పాలుగొన్నారు.

## కే అండ్ డీ మెన్స్ వేర్ షాపింగ్ మాల్ ను ప్రారంభించిన, డా.తుమ్మల యుగంధర్



ఖమ్మం, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఖమ్మం స్థానిక 44వ డివిజన్ బుర్హాన్ పురం బస్ డిపో రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన, కే అండ్ డీ మెన్స్ వేర్ షాపింగ్ మాల్ ను ప్రారంభించిన, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, ఈ సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటెల నానోబాడీలతో డెంగ్యూకు చికిత్స.. కనుగొన్న శాస్త్రవేత్తలు



హెల్త్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగ్యూ ఒకటి. ప్రతి ఏడాది లక్షలాది మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం ఇటీవల దశాబ్దాల్లో డెంగ్యూ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూ నివారణకు మెరుగైన చికిత్సలు, టీకాలు అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు తీవ్రంగా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మొహాలీ పరిశోధకులు డెంగ్యూ వ్యాధి నివారణలో ఒక కొత్త ఆశాకిరణాన్ని కనుగొన్నారు. ఒంటెల శరీరంలో ఉత్పత్తి అయ్యే ప్రత్యేక యాంటీబాడీలు, అంటే నానోబాడీలు డెంగ్యూ వైరస్‌ను నిరోధించే సామర్థ్యం కలిగి ఉన్నాయని వారి అధ్యయనం సూచిస్తోంది. భవిష్యత్తులో ఈ నానోబాడీలు చికిత్సలు, టీకాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశముంది. ఒంటెల యాంటీబాడీలు మనుషుల యాంటీబాడీలతో పోలిస్తే నిర్మాణ పరంగా భిన్నంగా ఉంటాయి. ఇవి చాలా చిన్న పరిమాణంలో ఉండటంతో పాటు అధిక స్థిరత్వాన్ని కలిగి ఉంటాయి. ఈ కారణంగా సాధారణ యాంటీబాడీలు చేరలేని వైరస్ భాగాలను కూడా ఇవి లక్ష్యంగా చేసుకోవచ్చు. జీవశాస్త్రంలో అసాధారణ వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా వైద్యరంగంలో కొత్త మార్గాలు తెరుచుకుంటాయని ఈ పరిశోధన మరోసారి రుజువు చేసింది.

**ఇన్ఫెక్షన్ మార్గాలను అడ్డుకునే సామర్థ్యం..**

ఒంటెల నుంచి పొందిన నానోబాడీలు డెంగ్యూ వైరస్ నాలుగు ప్రధాన రకాలపై ప్రభావవంతంగా పనిచేస్తాయని గుర్తించారు. ఇది డెంగ్యూ టీకా అభివృద్ధిలో ఒక పెద్ద సవాలుగా ఉన్న అంశం కావడంతో ఈ పరిశోధనకు ప్రాధాన్యత పెరిగిందని చెప్పవచ్చు. డెంగ్యూ వైరస్ నాలుగు వేర్వేరు రకాలుగా ఉండటం వల్ల ఒక రకానికి వచ్చిన రోగనిరోధక శక్తి మరో రకానికి పనిచేయదు. ఈ కారణంగా సమగ్ర రక్షణ కలిగిన టీకా తయారు చేయడం ఇప్పటివరకు కష్టంగా మారింది. అయితే ఒంటెల నానోబాడీలు వైరస్ ప్రోటీన్లకు బలంగా కట్టుబడి, ఇన్ఫెక్షన్ మార్గాలను అడ్డుకునే సామర్థ్యం చూపించడం ఆశాజనకంగా భావిస్తున్నారు. సాధారణ యాంటీబాడీలకు భిన్నంగా ఒంటెలు హెవీ-చైన్ యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తాయి. వీటి యాంటీజెన్‌ను గుర్తించే భాగాన్ని నానోబాడీ అంటారు. ఇవి చిన్న పరిమాణం, అధిక స్థిరత్వం, కఠిన పరిస్థితుల్లో కూడా పనిచేసే లక్షణాలు కలిగి ఉండటం వల్ల వైద్య పరిశోధనలో ఎంతో విలువైనవిగా భావిస్తున్నారు. డెంగ్యూ వ్యాధి ప్రధానంగా ఈడెస్ ఈజిప్టి దోమల ద్వారా వ్యాపిస్తుంది. ఇది సాధారణ జ్వరంగా ప్రారంభమై, తీవ్రస్థాయిలో డెంగ్యూ హీమరాజిక్ ఫీవర్, డెంగ్యూ షాక్ సిండ్రోమ్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 390 మిలియన్ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో దాదాపు 100 మిలియన్ కేసుల్లో లక్షణాలు కనిపిస్తాయి.

**యాంటీ వైరల్ చికిత్సలలో కీలక పాత్ర పోషించే అవకాశం..**

ప్రస్తుతం డెంగ్యూ చికిత్స ప్రధానంగా లక్షణాల నియంత్రణపైనే ఆధారపడి ఉంది. జ్వరం, డీహైడ్రేషన్, రక్తస్రావం వంటి సమస్యలను నియంత్రించడం ద్వారా రోగిని కాపాడే ప్రయత్నం జరుగుతుంది. టీకాలు ఉన్నప్పటికీ అన్ని రకాల వైరస్‌లపై సమగ్ర రక్షణ ఇవ్వలేకపోవడం వల్ల కొత్త పరిష్కారాల కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నానోబాడీలు ఇతర వైరస్‌లపై కూడా ప్రభావవంతంగా పనిచేసిన ఉదాహరణలు ఉన్నాయి. ముఖ్యంగా కోవిడ్ -19 కు కారణమైన SARS-CoV-2 వైరస్‌ను నిరోధించడంలో ఒంటెల నానోబాడీలు ఉపయోగపడినట్లు గత పరిశోధనలు నిరూపించాయి. ఇవి వైరస్ ప్రోటీన్లకు గట్టిగా కట్టుబడి, మనిషి శరీర కణాలకు వైరస్ సోకకుండా అడ్డుకుంటాయి. ల్యాబ్‌లలో సులభంగా తయారు చేయగలగడం, అవసరానికి అనుగుణంగా మార్చుకోవడం వంటి లక్షణాల వల్ల నానోబాడీలు భవిష్యత్తు యాంటీవైరల్ చికిత్సలలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. డెంగ్యూ విషయంలో కూడా ఇవి వైరస్ పెరుగుదల, వ్యాప్తిని అడ్డుకునే విధంగా ఉపయోగపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

**సమర్థవంతమైన టీకాలను రూపొందించే అవకాశం..**

ఈ పరిశోధన భవిష్యత్తులో డెంగ్యూ టీకా అభివృద్ధిపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. నానోబాడీలు గుర్తించిన వైరస్ లక్ష్యాలను ఆధారంగా చేసుకుని మరింత సమర్థవంతమైన టీకాలను రూపొందించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనుషులపై ఉపయోగించే ముందు ల్యాబ్ పరీక్షలు, జంతువులపై ప్రయోగాలు, క్లినికల్ ట్రయల్స్ వంటి దశలను పూర్తి చేయాలి. ఈ ప్రక్రియకు కొన్ని సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది. ఆధునిక ఇమ్యూనాలజీ రంగంలో అసాధారణ జీవ వ్యవస్థలపై పరిశోధనలు పెరుగుతున్నాయి. పాముల విషం నుంచి లామాల యాంటీబాడీలు వరకు, ప్రకృతిలోని ప్రత్యేక అణువులు కొత్త ఔషధాల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ఒంటెల నానోబాడీలు కూడా ఇదే దిశలో మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. భవిష్యత్తులో డెంగ్యూ సహా ఇతర వైరల్ వ్యాధులపై పోరాటంలో ఇవి కీలక ఆయుధంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

# నిద్రకుముందు ఇలా చేయండి..! స్ట్రోక్ రిస్క్ తగ్గుతుందంటున్న నిపుణులు




హెల్త్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): రాత్రిళ్లు మీ శరీరంలో అనీజీగా అనిపిస్తోందా? అయితే మీరు చేయాల్సిన ముఖ్యమైన పని ఒకటుంది. డైలీ పడుకోవడానికి 5 నిమిషాల ముందు ఒక గ్లాస్ మంచినీళ్లు తాగండి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే.. రాత్రిపూట నీరు తాగకపోవడంవల్ల బాడీ డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా తక్కువ నీళ్లు తాగేవారిలో ఈ రిస్క్ ఎక్కువ. నిర్లక్ష్యం చేస్తూ పోతే.. స్ట్రోక్, హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం కూడా లేకపోలేదని హెచ్చరిస్తున్నారు హెల్త్ ఎక్స్‌పర్ట్స్. కార్డియో వాస్కులర్, హైడ్రేషన్ రీసెర్చ్ జర్నల్స్‌లో పబ్లిషైన అధ్యయనాలు కూడా ఇదే చెబుతున్నాయి.

నిద్రపోయేముందు తాగే ఒక్కగ్లాస్ వాటర్ కూడా మీ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కొందరు పగలు సరిగ్గా నీళ్లు తాగరు. రాత్రిళ్లు కూడా సరిగ్గా తాగరు. దీనివల్ల నిద్రలో ఉన్నప్పుడు శరీరంలో నీటిలోపం ఏర్పడి రక్తం కొద్దిగా గట్టిపడే చాన్స్ ఉంటుందని, దీంతో రక్త నాళాలపై ఒత్తిడి పెరిగి హార్ట్ స్ట్రెయిన్ అవుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అధ్యయనాల ప్రకారం కూడా సరైన హైడ్రేషన్ కలిగి ఉన్నప్పుడే శరీరంలో రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. ఈ పరిస్థితి బ్లడ్ ప్రెజర్‌ను సమతుల్యం చేస్తుంది. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. హార్ట్ ఎటాక్, స్ట్రోక్ రిస్క్‌లను తగ్గించడంలో సహాయపడుతుంది.

**హైడ్రేషన్ ఎందుకు ముఖ్యం**

నిద్రలో శరీరం శ్వాస ద్వారా, చెమట ద్వారా నీటిని కోల్పోతుంది. ఈ పరిస్థితి మైల్డ్ డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. రక్తం గట్టిపడటంవల్ల హృదయం, మెదడుకు సరైన రక్త ప్రవాహం తగ్గుతుంది. దీంతో స్ట్రోక్, హార్ట్ ఎటాక్ ముప్పు పెరుగుతుంది. అలా జరగకూడదంటే రాత్రిపూట కూడా శరీరంలో తగిన మోతాదులో నీటిశాతం ఉండాల్సిందే. ఇది గుండెకు మంచి సపోర్ట్ ఇస్తుంది.

**ఏం చేయాలి?**

నీటిలోపం వల్ల ఏర్పడే డీహైడ్రేషన్, స్ట్రోక్, హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గాలంటే.. నిద్రపోయేముందు ఒక చిన్న గ్లాసెడు (150–200 మి.లీ) నీరు తాగాలి. రాత్రిళ్లు టాయిలెట్‌కు ఎక్కువసార్లు వెళ్లాల్సిన సమస్య ఉన్నవారు అయితే నిద్రకు కనీసం 30 నిమిషాల ముందు కొంచెం తక్కువ అయినా సరే నీరు తాగడం బెటర్ అంటున్నారు ఆరోగ్య నిపుణులు. గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే.. నీరు తాగడం అనేది సాధారణ ఆరోగ్య సలహా మాత్రమే. అంతేతప్ప నీరు తాగడమే స్ట్రోక్, హార్ట్ ఎటాక్‌లను నివారించదు. గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, ఫ్లూయిడ్ రెస్ట్రిక్షన్స్ ఉన్నవారు ఈ విషయంలో డాక్టర్లను సంప్రదించి వారి సలహాలు పాటించాలి.

క్రీడలు
epaper.krtvnews.com

# ఐపీఎల్ ప్లేయర్లకు షాక్..ఇకపై ఈ పనులు అస్సలు చేయెద్దు !





స్పోర్ట్స్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026 త్వరలోనే ప్రారంభం కానున్న తరుణంలో బీసీసీఐ కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే ప్లేయర్లు, తాము అమలు చేసే రూల్స్ పాటించాల్సిందేనని పేర్కొంది. ఈ రూల్స్ ప్రకారం, క్రికెటర్ల ఫ్యామిలీ మెంబర్లకు డ్రెస్సింగ్ రూమ్స్ లోకి అనుమతి ఉండదు. అదే సమయంలో స్టేడియంలోకి కుటుంబ సభ్యులు రాకూడదు. ఫ్రాంచైజీ ఏర్పాటు చేసిన బస్సుల్లో మాత్రమే హోటల్ నుంచి స్టేడియాలకు చేరుకోవాలి.

ప్రాక్టీస్ మ్యాచ్ లు ఆడేటప్పుడు క్రికెటర్లు స్లీవ్ లెస్ జెర్సీలు ధరించకూడదు. ఆరెంజ్, పర్పుల్ క్యాప్ అందుకున్న ప్లేయర్లు, కచ్చితంగా ప్రతీ మ్యాచ్ లోనూ వాటిని ధరించాల్సిందేనని బీసీసీఐ ఆదేశించింది. ఇందులో ఏ ఒక్క రూల్ బ్రేక్ చేసినా, మొదటి సారి వార్నింగ్ ఇస్తారని అంటున్నారు. రెండోసారి ఇదే తప్పు జరిగితే, ఫైన్ వేస్తారు. కాగా మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఆర్సీబీ, సన్ రైజర్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది.

# సీఎస్కే వారసుడిగా సంజూ..?

## ధోనీ రిటైర్మెంట్‌పై గంగూలీ, ఆకాశ్ రియాక్షన్ ఇదే!




స్పోర్ట్స్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): మరో మూడు రోజుల్లో ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో 'ఇదే ఎంఎస్ ధోనీకి చివరి సీజన్ అవుతుందా ?' అనే ప్రశ్న మళ్లీ మొదలైంది. గత కొన్నేళ్లుగా చాలా మంది అభిమానుల నోళ్లలో నానుతున్న ప్రశ్న ఇది. ధోనీ చివరిసారిగా భారత్ తరఫున ఆడి దాదాపు ఏడేళ్లు అయినప్పటికీ, చెన్నై సూపర్ కింగ్స్ తరఫున తన 19వ ఐపీఎల్ సీజన్‌లోకి అడుగుపెట్టనున్నాడు. అయితే.. తాజాగా ధోనీ రిటైర్మెంట్‌పై భారత దిగ్గజ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఐపీఎల్ 2026 తర్వాత ధోనీ రిటైర్ అయ్యే అవకాశం గురించి గంగూలీ ఎలాంటి వివరాలు బయటపెట్టలేదు, కానీ సమీప భవిష్యత్తులో ఈ విషయంపై తాము చర్చించుకునే అవకాశం ఉందని సూచించారు. "ఏం చేయాలో నేను (ఎంఎస్) ధోనీకి చెబుతాను, మీడియాకు కాదు" అని గంగూలీ ఒక కార్యక్రమంలో అన్నారు.

ఇదిలా ఉండగా.. మార్చి 28న ప్రారంభమయ్యే ఐపీఎల్ 2026 ధోనీకి చివరి సీజన్ కావచ్చని, అతడి వారసుడిగా సంజు సామ్సన్ సిద్ధంగా ఉన్నాడని భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కేవలం 'ఇంపాక్ట్ ప్లేయర్' గానే కొనసాగితే.. ఆ వెటరన్ రిటైర్మెంట్ గురించి ఆలోచించాలని చోప్రా అన్నారు. జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆకాష్ చోప్రా మాట్లాడుతూ.. క్రికెట్ అనేది ఫుట్‌బాల్ లాంటిది కాదని.. ఇక్కడ డగౌట్ నుంచి జట్టును నడిపించలేరని తెలిపాడు. ధోనీకి ఉన్న అతిపెద్ద బలం మైదానంలో ఉండి ఆటను చదవగలగడం. ఆ స్పష్టత, నమ్మకమే ఆయన్ని గొప్ప నాయకుడిని చేశాయని కొనియాడారు. ఒకవేళ ఆయన కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే ఆడాలనుకుంటే, ఇక రిటైర్మెంట్ ప్రకటించడం మంచిదని స్పష్టం చేశాడు. గంగూలీ, ఆకాశ్ చోప్రా వ్యాఖ్యలతో ధోనీ రిటైర్మెంట్ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది.

# సౌతాఫ్రికా టూరుకు హర్మన్‌ప్రీత్ సేన ఎంపిక..

## తొలిసారిగా జాతీయ జట్టులో అనుష్కకు చోటు



స్పోర్ట్స్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): వచ్చే నెలలో సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లే భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. టీ20 సిరీస్‌కు 15 మందితో కూడిన జట్టును ఎంపిక చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ అనుష్క శర్మ తొలిసారిగా జాతీయ జట్టుకు ఎంపికైంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఆకట్టుకోవడంతో ఆమె పిలుపు అందుకుంది. అలాగే, ఫాస్ట్ బౌలర్ కాశ్వీ గౌతమ్ కూడా తొలిసారిగా టీ20 జట్టుకు సెలెక్ట్ అయ్యింది. ఆమె వన్డే, టెస్టుల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్న వికెట్ కీపర్ ఉమా ఛెత్రి తిరిగి పొట్టి జట్టులో చోటు సంపాదించింది. అయితే, వైష్ణవి శర్మ, స్నేహ్ రాణా, కమలిని, అమన్‌జోత్ కౌర్ ఈ టూరుకు ఎంపిక కాలేదు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఏప్రిల్ 17న తొలి టీ20 జరగనుంది.19,22, 25, 27 తేదీల్లో మిగతా మ్యాచ్‌లు జరుగుతాయి. జూన్‌లో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌కు ఈ సిరీస్ భారత్‌కు సన్నాహకంగా ఉపయోగపడనుంది.

భారత మహిళల క్రికెట్ జట్టు

హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్, అరుంధతి రెడ్డి, రేణుక ఠాకూర్, క్రాంతి, శ్రీచరణి, శ్రేయాంక పాటిల్, కాశ్వీ గౌతమ్, భార్తీ ఫుల్మాలి, ఉమా ఛెత్రి, అనుష్క శర్మ

# ఆర్సిబి కి కొత్త యాజమాన్యం!




స్పోర్ట్స్ న్యూస్, 25 మార్చి (క్రాంతి న్యూస్): ఐపీఎల్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ బలమైన బ్రాండ్ వాల్యూ కలిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం అధికారికంగా చేతులు మారింది. గత 18 ఏళ్లుగా ఈ జట్టును నడిపిస్తున్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ ఫ్రాంచైజీని విక్రయించాలని నిర్ణయించుకుంది. ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (సుమారు 16,732 కోట్లు) భారీ ధరకు ఈ జట్టును సొంతం చేసుకుంది. ఈ కన్సార్టియంలో ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, యూఎస్ స్పోర్ట్స్ ఇన్వెస్టర్ డేవిడ్ బ్లిట్జర్, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ బ్లాక్‌స్టోన్ భాగస్వాములుగా ఉన్నాయి. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీ డీల్‌గా రికార్డులకు ఎక్కింది.

ఈ భారీ మార్పు తర్వాత జట్టు నిర్వహణలో కూడా కొత్త నాయకత్వం రానుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్, మాజీ ప్రొఫెషనల్ క్రికెటర్ అయిన ఆర్యమాన్ విక్రమ్ బిర్లా (కుమార మంగళం బిర్లా కుమారుడు) ఈ ఫ్రాంచైజీకి నూతన చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. టైమ్స్ ఇంటర్నెట్ చైర్మన్ సత్యన్ గజ్వాని వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారు. ఈ కొనుగోలు ఒప్పందం ప్రకారం కేవలం పురుషుల టీమ్ మాత్రమే కాకుండా, మహిళల డబ్ల్యూపీఎల్ టీమ్ బాధ్యతలు కూడా ఈ కొత్త యాజమాన్యానికే దక్కుతాయి. అయితే, ఈ మార్పులు వెంటనే అమలులోకి రావు. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత పూర్తి స్థాయి యాజమాన్య బదిలీ జరుగుతుంది.

యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ తన ప్రధాన వ్యాపారమైన మద్యం రంగంపై పూర్తి దృష్టి పెట్టాలని భావించడం, మరోవైపు ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి దేశీయ దిగ్గజాలు క్రీడా రంగంలోకి ప్రవేశించాలని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా విరాట్ కోహ్లీ వంటి స్టార్ ప్లేయర్ వల్ల ఆర్సిబి కి ఉన్న విపరీతమైన క్రేజ్, 2024, 2025 సీజన్లలో ఈ జట్టు వరుసగా టైటిల్స్ గెలవడంతో జట్టు విలువ విపరీతంగా పెరిగింది. అందుకే ఈ స్థాయిలో భారీ ధర పలికింది. ఈ కొత్త యాజమాన్యం రాకతో జట్టుకు మరింత ఆర్థిక బలం చేకూరుతుందని, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అడివి శేష్‌తో చిందులేయనున్న

# హాట్ బ్యూటీ



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో అడివి శేష్, అందాల భామ మృణాల్ ఠాకూర్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ ఒక అదిరిపోయే ట్విస్ట్ ఇచ్చారు. 'డెకాయిట్' మాస్ సాంగ్ రాబోతున్నట్లు ప్రకటించి సోషల్ మీడియాను షేక్ చేశారు. ఈ సినిమాలో ఒక మాస్ నంబర్ కోసం పాపులర్ సింగర్ జోనితా గాంధీని రప్పించినట్లు తెలిపాడు. తన మధురమైన గొంతుతో పాటలు పాడే జోనితా గాంధీ, ఈ 'డెకాయిట్' మూవీలో అడివి శేష్‌తో కలిసి 'చిచ్చుబుడ్డి' అనే మాస్ సాంగ్‌లో స్క్రీన్ పంచుకోబోతోంది. ఇండో-కెనడియన్ సింగర్ అయిన జోనితాకు సౌత్ ఇండియాలో భారీ క్రేజ్ ఉంది. ముఖ్యంగా 'అరబిక్ కుత్తు' (హలమితీ హబీబో) పాటతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు నేరుగా వెండితెరపై అడివి శేష్‌తో పోటీపడి డ్యాన్స్ చేయబోతుండటం విశేషం.

జోనితా, తన గ్లామర్,ఎనర్జిటిక్ స్టెప్పులతో ఈ పాటను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లనుంది. దర్శకుడు షానీల్ డియో ఈ పాటను చాలా గ్రాండ్‌గా చిత్రీకరించినట్లు సమాచారం. ఈ పాటను మార్చి 28న విడుదల చేయబోతున్నారు. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు.. అడివి శేష్ లాంటి పెర్ఫెక్ట్ యాక్టర్ పక్కన జోనితా స్క్రీన్ ప్రెజెన్స్ ఎలా ఉండబోతుందో చూసేందుకు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇక ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ , మొదటి పాటకు ఇప్పటికే సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ రెండో పాటతో సినిమాపై హైప్ మరింత పెరగడం ఖాయం అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అడివి శేష్ మార్క్ యాక్షన్, మృణాల్ ఠాకూర్ లవ్ ట్రాక్ ,జోనితా గాంధీ మాస్ సాంగ్.. ఇలా అన్ని కలగలిపిన చిత్రంగా 'డెకాయిట్' ఏప్రిల్ 10న థియేటర్లలో సందడి చేయనుంది.

# రామ్ చరణ్‌కు గాయం


## షూటింగ్ వాయిదా !

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మెగాస్టార్ చిరంజీవి వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఇండస్ట్రీలో అడుగుపెట్టిన రామ్ చరణ్, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ లాంటి పెద్ద సినిమాలో హీరోగా చేసి పాన్ ఇండియా స్టార్ గా ఎదిగిపోయారు చరణ్. ఇక ఇప్పుడు వరుసగా అన్ని పాన్ ఇండియా సినిమాలు మాత్రమే చేస్తున్నారు.

రామ్ చరణ్ కు గాయం అయినట్లు వార్తలు?

పెద్ది సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కు ఊహించని పరిణామం ఎదురయింది. రామ్ చరణ్ కంటికి గాయమైనట్లు సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్ది సినిమా కోసం యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. అయితే రామ్ చరణ్ కంటికి అయిన గాయం చాలా చిన్నదని, దీనివల్ల ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు సూచించినట్టు టాక్ నడుస్తోంది.

రెండు రోజులు రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచనలు కూడా చేశారట. ఈ న్యూస్ బయటకు రావడంతో రామ్ చరణ్ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. వెంటనే రాంచరణ్ కోలుకొని ఎప్పటి లాగే షూటింగ్ లో ఫినిష్ చేసుకోవాలి కోరుతున్నారు. అయితే రామ్ చరణ్ కు గాయమైనట్లు వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు చిత్ర బృందం ప్రకటన చేయలేదు



## ప్రభాస్ సినిమాలో ఛాన్స్ వచ్చినా

# ఆ పాత్రలు చేయను





తెలుగు తెరపై ఒకప్పుడు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాశి. స్టార్ హీరోల సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన ఆమె, ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో సీరియల్స్, క్యారెక్టర్ రోల్స్‌తో బిజీగా ఉన్నారు. ఈక్రమంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశి ప్రభాస్ గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రభాస్ అంటే తనకు చాలా ఇష్టమని చెప్పిన ఆమె, ఆయనతో కనీసం ఒక్క సినిమాలో అయినా నటించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఇక్కడే ఆమె ఒక కండిషన్ పెట్టారు. "ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభాస్ సినిమాలో అవకాశం వచ్చినా.. ఆయనకు తల్లి పాత్రలో మాత్రం అస్సలు నటించను. అలాగే అక్క, వదిన వంటి పాత్రలు ఇచ్చినా చేయను. ఎలాగూ హీరోయిన్ ఛాన్స్ రాదు కాబట్టి, కనీసం మంచి ప్రాధాన్యత ఉన్న పాత్ర అయితేనే చేస్తాను" అని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ప్రభాస్ మొదటి సినిమా 'ఈశ్వర్' ట్రైలర్ చూసినప్పుడే ఆయన ఒక పెద్ద స్టార్ అవుతారని తన తమ్ముడితో చెప్పానని రాశి గుర్తు చేసుకున్నారు.

తాను థియేటర్‌కు వెళ్లేది కేవలం ప్రభాస్ సినిమాల కోసమేనని, ముఖ్యంగా ఛత్రపతి, బాహుబలి 1, 2 చిత్రాలను వెండితెరపై చూసి ఎంజాయ్ చేశానని చెప్పారు. ప్రభాస్ నటించిన మిర్చి, రాధేశ్యామ్ వంటి మూవీల్లో కొన్ని పాత్రలకు తాను డబ్బింగ్ కూడా చెప్పానని రాశి వివరించారు. ప్రభాస్‌ను ఇప్పటి వరకు నేరుగా కలవలేదని రాశి ఆవేదన వ్యక్తం చేశారు. 'అడవి రాముడు' సినిమా షూటింగ్ సమయంలో ప్రభాస్ ఉన్న హోటల్‌లోనే తాను కూడా ఉన్నానని, అది తెలిసి ఎగిరి గంతేశానని చెప్పారు. అయితే ఆయన్ని నేరుగా కలవడానికి మొహమాటపడి, ఆయన రూమ్ నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడానని తెలిపారు. ప్రభాస్ సెట్స్‌లో అందరికీ ఇచ్చే మర్యాద గురించి తాను చాలా విన్నానని, ఆయన వ్యక్తిత్వం అంటే తనకు ఎంతో గౌరవమని రాశి పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఆమె కండీషన్లు చూసిన నెటిజన్లు షాక్ అవుతున్నారు.

# మమితా పాపులారిటీ

## కాల్షీట్స్ కోసం క్యూకడుతున్న ఫిల్మ్ మేకర్స్!



'ప్రేమలు' లాంటి డబ్బింగ్ చిత్రంతో సౌత్ మొత్తం రాత్రికి రాత్రే స్టార్ డమ్ సంపాదించుకున్న మలయాళ కుట్టీ 'మమితా బైజు'. మాలీవుడ్‌లో 15 సినిమాలు చేసినా రాని లక్.. ప్రేమలుతో దక్కడంతో దాన్ని క్యాష్ చేసుకుని పనిలో బిజీ అయ్యారు. తెలుగులో పెద్దగా ఆఫర్స్ రాకపోవడంతో.. పొరుగున ఉన్న కోలీవుడ్‌పై మమితా ఫోకస్ పెట్టారు. రెబల్ దెబ్బేసినా.. డ్యూడ్ హిట్‌తో అమ్మడి పాపులారిటీ స్కైని తాకింది. యూత్ అటెన్షన్ గ్రాబ్ చేయడంలో సక్సెస్ కావడంతో.. తమిళ్ ఫిల్మ్ మేకర్స్ మమితా కాల్షీట్స్ కోసం క్యూ కట్టారు.

ప్రేమలు తర్వాత మంచి ఆఫర్స్ వస్తాయని ఊహించిందీ కానీ.. ఏకంగా స్టార్స్ హీరోలైన విజయ్ దళపతి, సూర్య, ధనుష్‌లతో నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు మమితా బైజు. విజయ్ జననాయగన్‌తో పాటు సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్, ధనుష్ కరలో నటిస్తున్నారు. అదే సమయంలో సెలక్టివ్ సబ్జెక్ట్స్ చూజ్ చేసుకుంటూ.. మూవీ మూవీకి వేరియేషన్ చూపిస్తూ.. డిఫరెంట్ క్యారెక్టర్స్ ఎక్స్ ప్లోర్ చేస్తున్నారు.

జన నాయగన్‌లో విజయ్ దళపతి కూతురిగా.. స్ట్రాంగ్ గర్ల్ రోల్ మమితా బైజు చేస్తున్నారు. సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్‌లో పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్ చేస్తున్నారు. తన కన్నా 20 ఏళ్ల పెద్దయిన వ్యక్తి ప్రేమలో పడి, అతడి లవ్ కోసం పరితపించిపోయే నాటీగర్ల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఇక ధనుష్ కరలో పక్కా పల్లెటూరి అమ్మాయిగా, ఫక్తు డీ గ్లామర్ రోల్ చేయబోతున్నారు. విష్ణు విశాల్ ఇరుండు వానం ప్యూర్ లవ్ స్టోరీగా రాబోతుంది. ఇలా డిఫరెంట్ షేడ్స్‌ను చూపిస్తూ.. ఏ పాత్రకైనా తాను ఫిట్ అవ్వగలనని మమితా ప్రూవ్ చేసుకుంటున్నారు.

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com